శ్రీమతి అలిగింది. ఇవాళ్టికి మూడోరోజు. అలక వహించటానికి కారణం ఊహించటం పెద్ద కష్టమైన విషయమేమీకాదు. అలా అని అందరిలా అలిగిందా అంటే 'కాదు' అని కూడా చెప్పాల్సి వుంది. సాయంత్రం సకాలానికి ఆఫీసు నుంచి ఇంటికి శ్రీవారు రెక్కలు కట్టుకుని వాలలేదనో, లేక ఆరుగంటల సినిమా'షో'కి వెళదామని, అర్జంటు పనిచేత ఆఫీసుపని పూర్తవక రాలేకపోయాననీ శ్రీవారు చెప్పిన సమాధానం నచ్చకనో, మల్లెపూలు కొని పెట్టలేదనో, తెల్లచీర నీలి అంచు ఎంబ్రాయిడరీ బార్డరున్నది—తన కిష్టమైనది తెస్తానని తేలేదనో శ్రీమతి అలగ లేదు. మరి....ఊహించటం పెద్ద కష్టమేమీ కాదులే అని పొరబడ్డ సామాన్యులకు శ్రీమతి అలక గురించి కొంత ఆలోచించవల్సిందే.

'శ్రీమతి ఏమన్నా శ్రీవారూ....తందానతాన' అని కూనిరాగాలు తీసే శ్రీవారికి మాత్రం శ్రీమతి అలక్కి కారణం సంపూర్ణంగా తెలుసు. శ్రీమతి అప్పుడప్పుడు తనకు ఇష్టమైన నల్లసిరాతో తెల్ల కాగితాలను ఖరాబుచేస్తుంది! ఇది శ్రీవారి ఉవాచ. కాని శ్రీమతి అందరి స్త్రీల్లా కాకుండా లోకాన్ని తను కొద్దిగా నయినా ఊహించి, ఆలోచనలు సాగించగలనని నమ్మకం. దానితోనే అప్పుడప్పుడు కాగితాలను నింపగలిగేది. రెండు, మూడు పత్రికల్లో తన పేరు చూసుకున్నాక తన మీద తనకు కొంత ధైర్యం కలిగింది. ఆ ధైర్యంతోనే తన ఆలోచనలకు ఒక రూపం కల్గించాలనే తపన ఆమెలో ముదిరి ఆమె కలాన్ని మరింత పరుగులు తీయించసాగింది.

రోజూ లాగే ఆ రోజూ తెల్లవారింది. శ్రీవారే ఉదయం లేచి అన్ని కార్యక్రమాలు ముగించుకుని శ్రీమతికి కాస్త తోడ్పడుతూ ఉంటారు. తొమ్మిదిన్నరకల్లా భోజనం ముగించి, శ్రీమతితో ఒంటికాలిపై నిలబడే బస్సుకోసం పరుగులుదీశారు. పావుగంట ఆలస్యంతో ఆఫీసు చేరుకున్నాక మరో పావుగంటలో ఆఫీసరుగారి పిలుపొచ్చింది. బుద్ధిమంతుడిలా ఆయన గదిలోకి అడుగుపెట్టాక ఆయన అర్జంటుగా పుటప్ చెయ్యమన్న ఫైలందుకుని అరగంటవరకు కుస్తీ పట్టాడు. ఈ మధ్యలో 'వెరీ అర్జంట్! వెరీ అర్జంట'ంటూ రెండుసార్లు కబుర్లూ, త్వరగా కంప్లీట్ చేద్దామన్నా ఆ క్లర్కు సెలవులో ఉండటం వల్ల పని అవలేదు. ఇంతలో ఆఫీసరు గారి చిందులు, కేకలు, పిలుపులు. "సీ! మిష్టర్ రావ్! అర్జంటంటూ వత్తిడి చేస్తున్నా ఇంకా పూర్తవలేదు. నో! ఇటీజ్ టూ మచ్ బాడ్... రియల్లీ ఇట్ షోస్ యువర్ ఇనెబిలిటి ఇన్ వర్క్!" అంటూ సన్నని చీవాట్లు, విసుగుదలలు.

"నో సర్! ది కంసెర్న్డ్ క్లార్క్ ఈజ్ ఆన్ లీవ్. ది ఇంపార్టెంట్ పేపర్స్ ఆర్ ఆల్ విత్ హిమ్" అని ఒళ్ళు మండిపోయి అనాలనుకున్నా గొంతు నొక్కుకుపోయింది. "ఆల్‌రైట్! సబ్మిట్ ది ఫైల్ ఇమ్మీడియట్లీ". చిర్రుబుర్రు లాడాడు ఆఫీసరు. ఫైలు సబ్మిట్ చేసి కుర్చీలో కూలబడ్డాడు రావ్. ఆఫీసరు ఈ రోజు టూర్ పోతున్నాడు. నిజానికి నిన్ననే చెప్పాడు తనకు ఆ ఫైలు కావాలని. కాని ఆ వెధవ, ప్రక్క సీట్లో పాపారావ్ అత్తారింటికి చెక్కేసాడు పండక్కి—తనకి చెప్పనయినా చెప్పకుండా.

ఆఫీసరు వాన్ స్టార్టయిపోగానే కుర్చీలోంచి లేచాడు రావ్. కాంటీన్లో టీ త్రాగి, కణతలు రుద్దుకుంటూ హాఫ్ డే సి.ఎల్ పారేసి ఇంటికి ప్రయాణమయ్యాడు. తీరా ఇల్లు చేరేసరికి, తాళం కప్ప దర్శనం. పావుగంట తర్వాత శ్రీమతి హాజరయింది చేతిలో కాగితాలకట్ట, పెన్నుతో సహా. అసలే అసహనంగా వున్న శ్రీవారికి శ్రీమతి పద్ధతేం నచ్చలేదు. ఇక ఉగ్గబట్టలేక "ఎప్పుడూ ఆ కాగితాలే ప్రపంచమనుకుంటే వేరే పనులేం అవసరం లేదా నీకు? అయినా ఈ వేళప్పుడు ఎక్కడ నీ కాన్ఫరెన్స్‌లు? నీకోసం ఎంతసేపు వెయిట్ చెయ్యాలి? బొత్తిగా బుద్ధి, జ్ఞానం లేకుండాపోతున్నాయి. ఈసారి నుంచీ నీ చేతిలో కాగితాలూ, పెన్నూ చూస్తే విసిరవతల పారేస్తా. బీ కేర్‌ఫుల్!" ఆఫీసరు తనకు వడ్డించినదానికి రెట్టింపు వేగంతో సీరియస్‌గా

దులిపిపారేశాడు.

శ్రీమతి కొంచెం కంగారుపడింది. అయినా ధైర్యంగా అతన్ని త్రోసిపుచ్చి "అయ్యగారీ వేళప్పుడు దర్శనమిస్తారని కలగన్నానా? అయినా ఆఫీసరుగారు ఊళ్ళో లేనప్పుడు, ఆఫీసుకి శాల్యూట్ కొట్టేసి మ్యాట్నీలకు చెక్కేసే పెద్ద మనుషులు ఇలా అకస్మాత్తుగా ఇంటి మీద చెకింగ్ చేస్తారని ఊహిస్తే, ఎదురుగా నిలబడి స్వాగతసత్కారాలిచ్చేదాన్ని. ఇప్పుడయినా మించి పోయిందేం లేదు." విరగబడి నవ్వుతూ అంటున్న శ్రీమతిని ఛీత్కరిస్తూ గదిలోకిపోయి డ్రస్సు మార్చుకుని మంచం మీద వాలిపోయారు శ్రీవారు. శ్రీమతి వంటగదిలోకి వెళ్ళింది. ఇంతలో 'పోస్ట్' అంటూ రెండు కవర్లు విసిరేసి చక్కా వెళ్ళి పోయాడు పోస్ట్‌మాన్. వెళ్తూ వెనక్కి తిరిగి శ్రీవారికేసి ఇకిలిస్తూ మరీ వెళ్ళాడు. శ్రీమతి, శ్రీవారు ఒకేసారి పోస్ట్ తీసుకోబోయారు. ఒకరి వంక ఒకరు చూస్తుంటే, శ్రీవారే ముందు అందుకున్నారు. వాటిని చూస్తునే శ్రీవారి ముఖం చిర్విలాసంగామారి, వెనువెంటనే కఠినతరమై విసురుగా శ్రీమతికేసి విసిరి పారేశారు. అవి శ్రీమతికి తిరిగొచ్చిన రచనలు. ఈసారి శ్రీమతి మండిపడింది. మంచీ, మర్యాద లేకుండా ఏమిటా విసురంది. శ్రీవారు ఆవేశంలో నోర్ముయ్ అన్నారు. శ్రీమతి రెండన్నది శ్రీవారు నాల్గన్నారు. చివరికి శ్రీమతి మూడంకె, శ్రీవారు ఆరంకె అయ్యారు. అలా మొదలైంది కోల్డ్‌వార్. శ్రీమతి మాటమాట్లాడక పట్టుబట్టింది. శ్రీవారూ ఈ సత్యాగ్రహం ఎన్నాళ్ళో చూస్తానన్నట్లు తనూ సడలి పోలేదు. మల్లెపూలు, పందిరిమంచెం చిన్న బోయాయి. పండువెన్నెల, పాలనవ్వులూ వృథా ఐపోయాయి. ఒకటి, రెండు, మూడు రోజులు భారంగా గడచిపొయ్యాయి. నాల్గో రోజు (ఆది వారం) మధ్యాహ్నం రెండున్నరగంటలకు :

"అమ్మాయ్! అమ్మాయ్! చూడు తల్లీ! నీ పేరేమిటో తెలీదు. ఓ గ్లాసుడు పంచదారుంటే ఇస్తావ్. రెండు రోజుల్లో తెప్పించి ఇస్తాను. ఆఁ! అన్నట్లు మేము ఈ ప్రక్క వాటాలో దిగి నాలుగు రోజులైంది. నా పేరు పార్వతమ్మ. మా వారు రెవెన్యూ ఆఫీసులో పని చేస్తున్నారు. అన్నట్లు మీ వాటాకు అద్దెంత? పిల్లలెంత మంది? అతగాడేం చేస్తాడో?" ఇత్యాది ప్రశ్నలు, జవాబులన్నీ ఏ కరువు పెట్టింది పార్వతమ్మ అనబడే పర్వతమ్మ. శ్రీమతి ఓపిగ్గా జవాబులు చెప్పి, పంచదారతో ఆమెను సాగనంపింది. మరో అయిదునిమిషాల్లోనే పర్వతమ్మగారు చపాతీలు ఒత్తుకునే పీటతో ప్రత్యక్షమై, అది ఎప్పుడు, ఎందుకు, ఎలా చేయించిందో, దాని అవసరమెలా గరుస్తుందో రన్నింగ్ కామెంటరీ వినిపించింది. ఓపిగ్గా వింటున్నా ఆమె నిష్క్రమణానంతరం నవ్వాగలేదు శ్రీమతికి. నాలుగు రోజులుగా సత్యాగ్రహంతో 'బోర్' కొట్టిన శ్రీవారికి కూడా శ్రీమతితో జత కలపాల్సొచ్చింది. క్రమంగా చిన్న చిన్న మాటలు, చివరకు మామూలుగా ఒకరికొకరు క్షమాపణలు, ప్రేమలు, అభిమానాలు వగైరాలన్నీ తెలుపుకోటం జరిగాయి. ఫలితం (పర్వతమ్మగారి దయ వల్ల) ఫస్ట్‌షో, హోటల్ మీల్స్, శ్రీమతి తల్లో ఒక కిలో మల్లెచెండులూ, శ్రీవారి బుగ్గన తాంబూలపు గుర్తులు, వెన్నెలమత్తూ, వగైరా. ఇంకా చాలా సమయం ఉందన్నట్లు గడియారం పదకొండు గంటలు భారంగా పలికింది. ఇంతలో పర్వతమ్మగారింట్లో ఏడ్పులూ, దీనమైన ఆక్రోశాలు, గుద్దుల చప్పుళ్లూ, బరువుగా లాగిన చప్పుళ్ళూ శ్రీమతిని, శ్రీవారిని ఆశ్చర్యచకితులను చేశాయి. పర్వతమ్మగారి అధికార పూర్వకమైన కేకలు; "కొట్టకు పిన్నీ! ఇంకెప్పుడూ ఇలా చెయ్యం క్షమించు పిన్నీ!" అన్న దీనమైన అరుపులూ కించిత్ సందేహంలో ముంచెత్తాయి. శ్రీమతిది అసలే జాలిగుండె. అందులో రచయిత్రి కావటం మూలంగా జరుగుతున్న దేమిటో ఊహించింది. శ్రీవారితో ఏదో చెప్పబోతే "అర్ధరాత్రి వేళ అంకమ్మ శివాలు....కమాన్!" అని కొట్టి పారేశారు. నిజంగా భారంగానే గడిచింది శ్రీమతికి ఆ రాత్రి. మరునాడు ఎదురింటి తాయారు వల్ల పూర్తి సమాచారం సేకరించింది శ్రీమతి. సదరు పర్వతమ్మగారు వారి పతికి ద్వితీయం. సవతి బిడ్డలు ముగ్గురు. ఇద్దరాడపిల్లలు, ఒక

[లోకజ్ఞానం : సమాధానాలు]

1. 223. అండమాన్ ప్రాంతంలోని 204 చిన్న చిన్న దీవులనూ, నికోబార్‌లోని 19 దీవులనూ కలుపుకుని అండమాన్ – నికోబార్ దీవులు ఏర్పడ్డాయి. రాజధాని : పోర్ట్ బ్లేయర్.
2. ముండక ఉపనిషత్తు నుంచి.
3. యునైటెడ్ నేషన్స్ ఇండస్ట్రియల్ డెవలప్‌మెంట్ ఆర్గనైజేషన్ – అంటే 'ఐక్యరాజ్య సమితి పారిశ్రామిక అభివృద్ధి వ్యవస్థ' అని అర్థం.
4. ఆగస్ట్ 15, 1972. ఈ పిన్‌కోడ్ పద్ధతి ప్రకారం – అందులోని ఆరు అంకెలలో మొదటి అంకె ఆ రాష్ట్రాన్ని, రెండు, మూడు అంకెలు రాష్ట్రంలోని ప్రత్యేక ప్రాంతాన్ని, చివరి మూడు అంకెలూ ఉత్తరం చేరవలసిన తపాలా కార్యాలయాన్ని సూచిస్తాయి.
5. కాలేయము.
6. కప్ప కంటిపైన ఒక పలుచనిపొర వుంటుంది. అది నీటిలోకి ప్రవేశించగానే నీరు కళ్ళను క్రమ్మకుండా వుండేందుకు ఈ పొర కనుగ్రుడ్డుచుట్టూ రక్షణకవచంలా ఏర్పడుతుంది. అందువల్ల కప్ప నీటి లోపల వున్నప్పుడు కూడా కళ్ళు తెరుచుకునే వుండగలుగుతుంది.
7. తెల్లకణాలు. వీటినే 'ల్యూకోసైటిస్' అంటారు.
8. క్రిస్టియన్ హ్యూజెన్స్. హాలండ్ దేశస్థుడు. 1656 లో యితను గోడ గడియారాన్ని తయారు చేశాడు. అయితే అంతకు ముందే 1642 లో గలిలియో ఈ గోడ గడియారం నమూనా రూపొందించాడు. కాని అది పూర్తి చెయ్యకముందే అతను మరణించాడు.
9. మార్టినా నావ్రతిలోవా. గతంలో రెండుసార్లు వింబుల్డన్ ట్రోఫీ గెల్చుకున్న క్రిస్ ఎవర్ట్‌ని ఓడించి, అందరి అంచనాలూ తలక్రిందులు చేసిన మార్టినా వయసు 21. జెకొస్లోవేకియాకు చెందిన ఈమె అమెరికాలో స్థిరపడడానికి ప్రయత్నిస్తోంది. కమ్యూనిస్ట్ దేశాలనుంచి ఈ ట్రోఫీ గెలుచుకున్న ప్రథమ వనిత కూడా ఈమే కావడం ఇంకో విశేషం.
10. యాష్ మొలియన్ మ్యూజియం. 1679 లో నిర్మింపబడిన ఈ మ్యూజియం ఇంగ్లండు లోని ఆక్స్‌ఫర్డ్‌లో వుంది.

మగ. ఆ పిల్లల్ని రాచి రంపాన పెడుతుందని తాయారు రిపోర్టు. అదీ పూర్వం పర్వతమ్మగారి ఇంటి ప్రక్కనున్న తన మిత్రురాండ్ర ద్వారా తాయారు సేకరించిన సమాచారం. శ్రీమతి, శ్రీవారికి ఈ సమాచారాన్ని ట్రాన్స్ఫర్ చేసింది. ''బొరా!'' అని వాపోయారు శ్రీవారు.

కాలెండర్లో పేజీలు చిరిగిపోతున్నాయి. ఈ మధ్య కాలంలో పర్వతమ్మగారు చిన్న చిన్న అప్పులు, (తప్పు: చేబదుళ్ళు–తిరిగి ఇవ్వబడవు.) పెద్ద పెద్ద కబుర్లు, గొప్పలు అన్నీ, మామూలుగా దొర్లించేస్తున్నారు. శ్రీమతి మరికొన్ని విషయాలు రాబట్టింది. శ్రీ శ్రీ శ్రీ మ తి పర్వతమ్మగారికి ద్వితీయం కొంత లేటుగా జరిగిందట. కడుపున రెండు కాయలు కాసి రాలిపోయాయట. ఇప్పుడిక మూడవదానికై 'వెయిటింగ్' చేస్తున్నదట. ఇవన్నీ మహిళా సమాజం అందించిన వార్తల్లో కొన్ని భాగాలు. ఇకపోతే పర్వతమ్మగారు శ్రావణ మంగళవారం నోములు, పూజలు, వ్రతాలు చేస్తుంది. అన్నీ బాగానే ఉన్నాయి. కానీ అప్పుడప్పుడూ రాత్రి, పగలు భేదం లేకుండా అరుపులు, తిట్లూ, కొట్లు, పిల్లల చిత్రవధ షరా మామూలే. శ్రీమతి కార్యరంగంలో దూకి అసలు విషయం కనుక్కుందామనుకున్నా శ్రీవారి 'బ్రేక్' వల్ల సాహసించలేదు. ఇంతలో శ్రీమతి తరపున వాళ్ళ బంధువుల ఇళ్ళలో పెళ్ళని శుభలేఖ అందింది. శ్రీవారు, 'వెళ్లాలా?' అని దీనంగా అడుగుతున్నా వెళ్ళి తీరాలని శ్రీమతి వాళ్ళ పుట్టింటికి బయలుదేరింది. శ్రీవారిని, పర్వతమ్మ గారికి అప్ప చెప్పి వెళదామనుకున్నా కించిత్ సందేహంతో వెనుకంజవేసింది. దాంతో శ్రీవారికి హోటల్ భోజనం, ఫ్రెండ్ రూంలో నిద్ర తప్పలేదు.

ఒక ఇరవై రోజుల అనంతరం శ్రీమతి మళ్ళీ శ్రీవారి దరిచేరింది. ప్రియసమాగమం తరువాత శ్రీమతికి కొన్ని కొత్త విషయాలు తాయారు ద్వారా తెలిశాయి. పర్వతమ్మగారికి నొప్పులొచ్చి ప్రసవించలేక, చివరకు మృతశిశువును కన్నదని– డాక్టర్లు మళ్ళీ బిడ్డలు పుడితే తల్లి ప్రాణానికే గండమని ఆపరేషన్ చేసి గర్భకోశాన్ని తీసి వేశారని, ఇప్పుడిప్పుడే పర్వతమ్మగారు కోలుకుం టోందని. శ్రీమతి దిగ్భ్రాంతురాలైంది. విషయా లన్నీ శ్రీవారికి కూడా తెలిశాయి. ఇద్దరూ చాలా విచారించారు. పరామర్శలు జరిగాయి. పర్వతమ్మ గారు వీళ్ళిద్దర్నీ చూసి కళ్ళనీళ్ళు పెట్టుకున్నారు. వీళ్ళ ఓదార్పులతో, ఆత్మీయమైన మాటలతో మరికొంత సన్నిహితురాలైంది పర్వతమ్మగారు.

ఆ వేసం కాలం మండుటెండలో ఓ రోజు 'పోస్ట్' అంటూ మళ్ళీ పోస్ట్‌మాన్ ఓ పత్రికను శ్రీమతి ఇంటిముందు విసరబోయి పర్వతమ్మగారు కన్పించటంతో భయభక్తులతో ఆమెకు అంద చేశాడు. పర్వతమ్మగారు బియ్యం ఏరటం అయ్యాక కళ్ళజోడులో తొంగిచూస్తూ పత్రిక చదివేస్తోంది. చదవటం పూర్తయ్యాక ఆమె ఒక్కసారిగా మారిపోయి మౌనంగా రోదించ సాగింది. కారణం ఆమె చదివిన కథ 'మనసు మారింది'. ఆ సమయంలోనే శ్రీమతి రిక్షా దిగి తాళం చెవులకోసం పర్వతమ్మగారిని కలుసుకో బోయింది. కళ్ళవెంబడి ధారలతో రోదిస్తున్న పర్వతమ్మగారిని చూసింది. ఆమెను చూస్తూనే పర్వతమ్మగారు ఆప్యాయంగా కౌగలించుకుని బిగ్గరగా ఏడ్వసాగింది. శ్రీమతి ఓదార్పుతో ఆమె వెక్కిళ్ళ మధ్య విషయం చెప్పసాగింది. 'మనసు మారింది' కథలో మల్లే తన బ్రతుకు కూడా చితికిపోయిందని వాపోయింది. శ్రీమతి మెల్లగా అసలు విషయం చెప్పింది. స్వంత బిడ్డలు కాకపోయినా సవతి పిల్లలను తన పిల్లలుగా చూసుకున్న హీరోయిన్ త్యాగనిరతిని బోధ పరచింది. ఓ అరగంట తర్వాత పర్వతమ్మగారు పశ్చాత్తాపంతో ''ఇప్పటికైనా కళ్ళు తెరుస్తాను. ఆ దేవుడు నాకు ఇక సంతానం ఎలానూ లేకుండా చేశాడు. కనీసం ఉన్న బిడ్డలనయినా కన్న బిడ్డలుగా చూసుకుంటాను. అప్పుడే నిజంగా నా బ్రతుక్కి సార్థకం'' అంది. శ్రీమతి ఎగిరి గంతేసింది. ఉత్సాహంతో చిందులు తొక్కింది. శ్రీవారు ఆఫీసు నుంచి రాగానే చుట్టేసింది. పత్రిక చేతికిచ్చి చదవమంది. శ్రీవారు శ్రీమతి మాట కాదనలేక చదివానని పించారు. శ్రీమతి కళ్ళు విజయగర్వంతో మెరిసాయి. శ్రీవారు కూడా ఆశ్చర్యంగా శ్రీమతికేసి చూశారు. ''ఇది నిజంగా కథ కాదండి! జీవితం'' అంటూ పర్వతమ్మ గారితో తన సంభాషణం ఏకరువు పెట్టింది. ''నిజంగా కథల వల్ల మనుషులు మారతారను కోవడం ఎండమావులు చేరినట్లని అనుకునేవాణ్ణి. నువు చెప్పేదంతా నిజమైతే నిజంగా ఈ కథ వ్రాసిన 'శ్రీమతి' చాలా గొప్పవ్యక్తి సుమా! ఇవీ కథలంటే. మరి నువ్వూ వున్నావెందుకు? సవతి బిడ్డలను తన బిడ్డలుగా ఆదరించలేక, చివరకు తనకిక మాతృత్వానికి స్థానం లేదని తెలిశాక ఆ తల్లి బాధతో సవతి పిల్లలను కన్న బిడ్డలుగా స్వీకరించటం నిజంగా అపూర్వం సుమా! రేపే రచయిత్రికి ధన్యవాదాలతో ఓ ఉత్తరం వ్రాస్తా''....

''స్టాప్! ఆ రచయిత్రి మీద చాలా అభిమానం కల్గిందే! అయితే ఇదిగో అడ్రస్సు!'' అంటూ తమ ఇంటి అడ్రసు వ్రాసిచ్చింది శ్రీమతి.

''వ్హాట్! ఆ రచయిత్రి 'శ్రీమతి' నిజంగా నువ్వేనా? ఇది కలా! నిజమా! ఆ శ్రీమతే నా శ్రీమతి. ఆయామ్ సారీ శ్రీమతి. నిజంగా నువ్వే ఆ శ్రీమతివి కాబట్టి అభినందనలు చేతులతో కాదు.''

''మరి!''

''ఇలా!'' అంటూ ఆమె పెదాలపై.... అంతే....కథ అయిపోయింది.

సూర్యుడు

ఉదయం

అప్పుడే

తల్లి గర్భం నుండి

ఉద్భవించిన

రక్తసిక్త శిశువులాగ....

సాయంత్రం

ఎవరో

హత్యచేసి

దూరంగా

దిగంతాల్లోకి

విసిరేసిన

నెత్తుటి ముద్దలాగ....

—కాద సరోజారాణి